క్లుప్తంగా

రూ.7 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్: ఖమ్మం మామిళ్లగూడెంకు చెందిన వ్యాపారి రూ.7లక్షలకు గాను శుక్రవారం దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. ఖమ్మంలోపాత ఇనుము వ్యాపారం చేసిన సి.సంజీవరావు పలువురి వద్ద అప్పులు చేశాడు. అయితే, ఈ అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురుకావడంతో ఇద్దరిని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది ద్వారా స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని రామన్నపేటకు చెందిన యువతి ఎస్.రేణుక(19) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె వివాహ యత్నాల్లో తల్లిదండ్రులు ఉండగా, ఇష్టం లేని రేణుక ఈనెల 1న ఎలుకల మందు తాగింది. దీంతో ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ రామకృష్ణ తెలిపారు.

ఆంబోతు పేరిట అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

కూసుమంచి: మండలంలోని కిష్టాపురం గ్రామంలో గత నెల 24న గ్రామానికి చెందిన ఆంబోతు అనారోగ్యంతో మృతి చెందింది. ఇట్టి ఆంబోతుకు శుక్రవారం గ్రామస్తులు దశ దిన ఖర్మను నిర్వహించారు. ఆంబోతును ఖననం చేసిన ప్రదేశంలో గ్రామస్తులు పూలు, పసుపు, కుంకుమలు చల్లి పూజలు చేశారు. ఇదిలా ఉండగా.. గ్రామస్తులందరూ విరాళాల రూపంలో రూ.లక్ష వరకు వస్తూలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంబోతు పేరిట అన్నదానం చేయటం విశేషం.

వెంకయ్య మృతికి బార్ అసోసియేషన్ సంతాపం



వెంకయ్య కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న సొసైటీ బాధ్యులు

ఖమ్మంలీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది పంబా వెంకయ్య అనారోగ్యంతో మృతి చెందగా, బార్ అసోసియేషన్ బాధ్యులు సంతాపం ప్రకటించారు. ఈమేరకు అధ్యక్షుడు గొల్లపూడి రామారావు ఆధ్వర్యాన శుక్రవారం బార్ అసోసియేషన్ హాల్‌లో వెంకయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, కాటమనేని రమేష్, బిచ్చాల తిరుమలరావు, మలీదు నాగేశ్వరరావు, మందడపు శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, బసవపున్నయ్య, స్వర్ణకుమారి మాట్లాడగా, బీఆర్ఎస్, టీడీపీ లీగల్ సెల్, ఐలు బాధ్యులు కూడా సంతాపం ప్రకటించారు. కాగా, అడ్వకేట్స్ సొసైటీ నుంచి వెంకయ్య సతీమణికి రూ.25వేల చెక్కును సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండపల్లి జగన్‌మోహన్ రావు, కాసర రాజశేఖర్‌రెడ్డి అందజేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రైటర్ పద్మభూషణ్
వినోద	మైకేల్
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	రెబల్స్ ఆఫ్ తుపాకులగూడెం

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	30	చుక్కకూర	2
బోడ కాకర	80		10
బీర	46	తోటకూర	2
దొండ	22		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	80		10
గోరుచిక్కుడు	36	మెంతికూర	5
క్యాబేజీ	14		20
క్యాలీఫ్లవర్	34	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		20
చామగడ్డ	64	పుదీన	1
క్యారెట్	20		20
క్యాప్సికం	40	-ఖమ్మం వ్యవసాయం	

ఉగ్గ పట్టుకోవాల్సిందే..!

బడిలో చదువులు.. బజార్లో టాయిలెట్లు

- ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్లు కరువు
- పబ్లిక్ టాయిలెట్ల వినియోగం కోసం ప్రయాణికులతో పాటు క్యూ
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పబ్లిక్ టాయిలెట్ల వద్ద క్యూ కట్టిన పాఠశాల విద్యార్థులు

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ సకల సౌకర్యాలు కల్పించి అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన బస్తీ మన బడి పథకం ఓ పాఠశాల విద్యార్థులను రోడ్డుపాలు చేసింది. కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, పెయింటింగ్, సరిపడా తరగతి గదుల కల్పన లక్ష్యంగా ఈ పథకం ప్రవేశపెట్టినప్పటికీ బాలురకు సరైన టాయిలెట్లు లేక కార్పొరేషన్ నిధులతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను వినియోగించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇది ఎక్కడో కాదండి ఖమ్మం నగరం నడిబొడ్డున ఉన్న ఇందిరానగర్ జిల్లా పరిషత్ పాఠశాలలోని దుస్థితి. బడిలో చదువులు బాగా ఉన్నా.. బజార్లోని టాయిలెట్ల్ వద్ద మాత్రం ఉగ్గ పట్టాల్సిందే.

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ జెడ్పీ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు మొత్తం విద్యార్థులు 420 మందికిపైగా ఉండగా.. అందులో బాలికలు 142 మంది, బాలురు 278 మంది వరకు ఉన్నారు. కాగా, మన బస్తీ మన బడి పథకం కింది నూతనంగా నిర్మాణం చేసిన తరగతి గదులతో పాఠశాల అందంగా ఉంది. కానీ, వందలాది మంది విద్యార్థులున్న ఈ బడిలో టాయిలెట్స్ సౌకర్యం లేదు. గతేడాది వరకు టాయిలెట్లు ఉన్నా.. మన బస్తీ మన బడి పథకంలో భాగంగా తరగతి గదుల పునఃనిర్మాణం సమయంలో టాయిలెట్లను తొలిగించారు. తర్వాత బాలికలకు టాయిలెట్స్ సౌకర్యం కల్పించారు కానీ బాలురలకు మాత్రం మరిచారు. పాఠశాల నూతనంగా నిర్మాణం చేసిన తరగతి గదులతో అందంగా ఉన్నప్పటికీ టాయిలెట్స్ సౌకర్యం లేకపోవడంతో బాలురందరికీ పబ్లిక్ టాయిలెట్స్ దిక్కయ్యాయి. వీరంతా ఇందిరానగర్ జంక్షన్ సెంటర్‌లో కార్పొరేషన్ నిధులతో నిర్మాణం చేసిన పబ్లిక్ టాయిలెట్లను వినియోగించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఒకేసారి వెళ్లడంతో అక్కడ ప్రయాణికులతో పాటు విద్యార్థులు క్యూకట్టి వినియోగించుకోవాల్సి వస్తుంది.

భయంభయంగా..

పాఠశాల ఆవరణం దాటి నిత్యం రద్దీగా ఉండే ఇందిరానగర్ జంక్షన్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్ల కోసం అవస్థలు పడుతూ వెళ్తున్న విద్యార్థులు తిరిగి వచ్చేంత వరకు ఉపాధ్యాయులు భయంభయంగా ఎదురు చూడాల్సి వస్తోంది. పాఠశాలకు నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి పోతుంటారు కానీ ప్రధాన సమస్యగా ఉన్న టాయిలెట్స్ మాత్రం ఎవరికీ కనపడడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా తొలి ప్రాధాన్యతగా మన బస్తీ మన బడి పథకం నిధులతో తక్షణమే టాయిలెట్స్ నిర్మాణం చేయించాలని కోరుతున్నారు.

సమస్యకు పరిష్కారం శూన్యం..

పాఠశాలలో టాయిలెట్స్ సమస్యపై ఉపాధ్యాయులు, హెచ్ఎం, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు జిల్లా విద్యాశాఖాధికారితో పాటు ఎంఈఓ, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా వినతిపత్రాలు సైతం అందించారు. అయినా సమస్యకు ఇంతవరకు పరిష్కారం లభించలేదు. విద్యా సంవత్సరం ముగిసే సమయమవుతున్నప్పటికీ మాకు ఇదేం కష్టాలు అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాలలోని బాలికల టాయిలెట్లు

హాస్టళ్లకు పరుగులు..

ఇటీవల పబ్లిక్ టాయిలెట్స్ నిర్వాహణ చేస్తున్న వారు అనారోగ్య కారణంగా తాళం వేసుకోని వెళ్లడంతో ఆ రోజు విద్యార్థుల సమస్య వర్ణాతీతంగా మారింది. కొంతమంది విద్యార్థులు తప్పని పరిస్థితిలో సుదూరంగా తాము ఉంటున్న హాస్టళ్లకు పరుగులు పెట్టాల్సి వచ్చిందని విద్యార్థులు వాపోతున్నారు.

డీఈఓ దృష్టికి తీసుకెళ్లాం..



పాఠశాలలో బాలురలకు టాయిలెట్స్ లేక సెంటర్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ వినియోగిస్తున్నారు. ఈ సమస్యపై గతంలోనే డీఈఓ, స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లాం. డీఈఓ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు లేక రాసినట్లు కూడా తమకు కాపీలు పంపారు.

– కేవీ శైలజలక్ష్మి, పాఠశాల హెచ్ఎం

పబ్లిక్ టాయిలెట్లే దిక్కు..



మా పాఠశాలలో ఏడాదిగా టాయిలెట్స్ లేకపోవడంతో బాలురమంతా చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇందిరానగర్ సెంటర్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్సే మాకు దిక్కయ్యాయి. అక్కడ కూడా మాతో పాటు ప్రయాణికులు ఉండటంతో క్యూ కట్టాల్సి వస్తోంది.

– కె.చంద్, పదో తరగతి విద్యార్థి

ఇబ్బంది పడుతున్నాం..



పాఠశాలలో టాయిలెట్స్ లేకపోవడంతో విరామ సమయంలో అందరం ఒకేసారి పబ్లిక్ టాయిలెట్స్ కోసం వెళ్తున్నాం. దీంతో అక్కడ పెద్ద క్యూ కట్టి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఒక్కోసారి నరకయాతన పడాల్సి వస్తోంది. వెంటనే టాయిలెట్స్ సమకూర్చాలి.

– వి.వినయ్, పదో తరగతి విద్యార్థి

నిందితులను కఠినంగా శిక్షించాలి



హోంమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కేవీ కృష్ణారావు, ప్రజాసంఘాల నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బహుజన న్యాయవాద దంపతులు మోజెస్ కృష్ణఫర్, అనురాధలపై భౌతిక దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు కోరారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యాన హోంమంత్రి మహమూద్‌అలీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన న్యాయవాదులపై దాడి చేసిన నిందితుని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, కో కన్వీనర్‌లు రహమాన్, భద్రూనాయక్, సంజీవరావు, వెంకటరమణ, అఖిల్, ఉపేంద్రనాయక్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో బీజేపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న నున్నా రవికుమార్

నేలకొండపల్లి: రానున్న ఎన్నికల్లో పాలేరులో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా వాడుకోవడంతోనే పంచాయతీల పాలన కుంటుపడిందని తెలిపారు. సంస్థాగతంగా అన్ని గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని, కుటుంబపాలనకు చరమగీతం పాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, జిల్లా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, నాయకులు కోటి హనుమంతరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, మీగడ గోపి, దుర్గారావు, నున్నా వెంకయ్య, కాళంగి వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లను కాషాయమయం చేయడమే లక్ష్యం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీని బలోపేతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి వెంకటనారాయణ యాదవ్ కోరారు. శుక్రవారం 53వ డివిజన్‌లో నిర్వహించిన బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆరు బూత్‌లలో కమిటీలు వేసినట్లు తెలిపారు. రాబోయ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ బూత్ స్థాయిలో పార్టీ కమిటీని మరింత పటిష్టపరిచి మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. టూటౌన్ ప్రభారి సుదర్శన్ మిశ్ర మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో చేరికలు మరింతగా ఉండి డివిజన్లను కాషాయమయం చేయటమే లక్ష్యం అన్నారు. సమావేశంలో టూటౌన్ అధ్యక్షుడు భద్రం, డివిజన్ నాయకులు షేక్ ఆసీఫ్, కె.వెంకటేశ్వర్లు,మలీదు మల్లికార్జున్, రవీందర్ పాల్గొన్నారు.

లింగమంతుల జాతరను విజయవంతం చేయండి



జాతరకు ముస్తాబైన శ్రీలింగమంతుల స్వామి దేవాలయం

కామేపల్లి (కారేపల్లి): కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని కొండాయిగూడెం రెవెన్యూ పరిధిలో గల పురాతన చరిత్ర కలిగిన యాదవుల ఆరాధ్య దైవం శ్రీ లింగమంతులస్వామి జాతర ఈ నెల 6వ తేదీన నిర్వహించబడుతుందనిఖమ్మం జిల్లా అఖిల భారతయాదవ మహాసభ గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ తెలిపారు.ఈ జాతరలో పాల్గొనే యాదవులందరికీ ఎటువంటి ఆటకం లేకుండా మొక్కలు తీర్చుకునేలా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. అలాగే, ఈ జాతరకు భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయంతం చేయాలని సూచించారు. అంతేకాక సూర్యాపేట జిల్లా దురాజుపల్లిలో జరిగే లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగ గుర్తించాలని అన్ని ప్రభుత్వ లాంఛనాలతో పండుగ నిర్వహించి, ఆ రోజు సెలవుదినంగా ప్రకటించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అధిక ధరలను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నేలకొండపల్లి: ఎరువులు కృత్రిమ కొరతను సృష్టించి.. అధిక ధరలను వసూలు చేస్తున్నారని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి పగిడికత్తుల నాగేశ్వరరావు ఆరోపించారు. అధిక ధరలను వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. రైతులకు యూరియా అవసరాన్ని గుర్తించి కొరత సృష్టించి సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవటంతోనే వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. పిచికారీ మందులు కొంటేనే ఎరువులు ఇస్తామని ముడి పెడుతున్నారని ఆరోపించారు. దుకాణాలు తనిఖీలు చేసి, ఎరువులు, కల్తీ విత్తనాలు, అధిక ధరలను అరికట్టి రైతులను దోచుకుంటున్న వ్యాపారులపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవడంతో పాటు ఎరువులు సరిపడా అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు పగిడికత్తుల రామదాసు, దామళ్ల రామదాసు, సామాజిక కార్యకర్త రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి



వినతి పత్రం అందిస్తున్న వెంకన్న, తదితరులు

రఘునాథపాలెం: అర్హులైన కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ప్రగతిశీల తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రఘునాథపాలెం తహసీల్దార్ నర్సింహారావుకు వినతి పత్రం అందించారు. అనంతరం సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు పెరబోయిన వెంకన్న మాట్లాడుతూ.. ఇల్లు లేని కార్మికులకు ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, 50 ఏళ్లు దాటినా కార్మికులకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, కార్మిక బంధు ఇవ్వాలని, లేబర్ కార్డు పొందిన కార్మికులకు ప్రభుత్వం ద్విచక్రవాహనాలు ఇవ్వాలని, కార్మికులకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి, కాట్రాల శ్రీను, పవన్, రమేష్, నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యాన నిరసన



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కామేపల్లి (కారేపల్లి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు(శనివారం) అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టడంతో ముందస్తుగా పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో శుక్రవారం ముందస్తు అరెస్టులు హేయమైన చర్య అంటూ.. కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు రాముదాసు, సత్రం, వినయ్, అఖిల్‌కుమార్, తరుణ్, బసవయ్య, ఉమేష్, అక్షర, యామిని పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి తరలిన నాయకులు..

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే అసెంబ్లీ ముట్టడికి పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాకు జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, 2020 న్యూ ఎడ్యుకేషన్ పాలసీ నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు కరుణ్, శివ, సతీష్, గణేష్, పృథ్వీ, అరవింద్ పాల్గొన్నారు.

'హార్వెస్ట్' విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న హార్వెస్ట్ యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ మ్యాథమెటిక్స్ కాంపిటేషన్స్–10 నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో తమ విద్యార్థి పన్విక్ కిలారు ప్రతిభ కనబర్చినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఐఐటీ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లాంగ్‌జంప్‌లో వైశాలికి కాంస్య పతకం..



బి.వైశాలి

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న బద్ది వైశాలికి ఆల్ ఇండియా సీబీఎస్ఈ అథ్లెటిక్స్ మీట్‌లో లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం దక్కించుకుంది. ఈనెల 1 నుంచి 4వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరుగుతున్న జాతీయ స్థాయి సీబీఎస్ఈ క్రీడల్లో సౌత్ ఇండియా తరపున ప్రాతినిధ్య వహించిన వైశాలి స్వర్ణ పతకం రావడంతో ఆల్ ఇండియాకు అర్హత సాధించింది. ఈమేరకు సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

నేడు 'హార్వెస్ట్' 21వ వార్షికోత్సవం

ఖమ్మం సహకారనగర్: హార్వెస్ట్ విద్యాసంస్థల 21వ వార్షికోత్సవాన్ని నేడు(శనివారం) విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సీపీ విష్ణు ఎస్ వారియర్, క్రెస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ వై.నాగమణి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో శుక్రవారం కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసాని సైదులు, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ విద్యానికేతన్'లో స్పోర్ట్స్ డే



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కరస్పాండెంట్ రాంప్రసాద్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీ విద్యానికేతన్ సీబీఎస్ఈ పాఠశాలలో వార్షిక క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గొల్లపుడి రాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలుత జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సందర్శన



కిష్టాపురంలో పరిశీలిస్తున్న రాంబాబు

కూసుమంచి: మండలంలోని కిష్టాపురం, కూసుమంచి, మునిగేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను శుక్రవారం అదనపు డీఎం అండ్‌హెచ్ఓ, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాంబాబు సందర్శించారు. శిబిరాల నిర్వహణను గ్రామస్తులు, సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్, సీహెచ్ఓ వలీయుద్దీన్ తదితరులు ఉన్నారు.

చింతల చెరువుకు 'భక్త రామదాసు' నీరందించాలి

కూసుమంచి: పోచారం గ్రామ పంచాయతీ పరిధిలోని చింతల చెరువుకు భక్త రామదాసు ప్రాజెక్టు నుంచి సాగర్ జలాలు అందించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం నాయకులు చెరువును పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. చెరువుకు భక్తరామదాసు నీరు సరఫరా కాకపోవటంతో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి చొరవ తీసుకుని నీటిని సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తోలకూరి రాజు, బిక్కసాని గంగాధర్, నాయకులు మల్లె సన్మంరావు, ఎడవెల్లి రమణారెడ్డి, శీలం గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పత్తి నిల్వకు గోదాములు కల్పించాలని వినతి



ఏఎంసీ చైర్‌పర్సన్ శ్వేతను సత్కరిస్తున్న ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి రవాణాకు ఇబ్బందులు నెలకొన్నందున మార్కెట్ పరిసర ప్రాంతాల్లో గోదాముల సౌకర్యం కల్పించాలని ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎగుమతి శాఖ ప్రతినిధులు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేతను కోరారు. నూతనంగా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్వేతను శుక్రవారం సాయంత్రం చాంబర్ ఆఫ్ కామర్స్ సహాయ కార్యదర్శి మన్నుం కృష్ణ, ఎగుమతి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నల్లమల ఆనంద్, చెరుకూరి సంతోష్‌కుమార్, నల్లమోతు లక్ష్మయ్య, బైరిశెట్టి రమేష్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ... పత్తి రవాణాలో లారీల సమస్య ఉందని రాజస్థాన్, హర్యానావంటి రాష్ట్రాలకు పత్తిని రవాణా చేయాల్సి వస్తుందని వివరించారు. లారీల సమస్య కారణంగా మార్కెట్ యార్డుల్లో పత్తి బస్తాలను నిల్వ పెడుతున్నామని, ఇందుకోసం ప్రత్యేకంగా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న గోదాములను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.